క్లుప్తంగా

ఎన్ఎస్ఎస్ దినోత్సవం



కేజీఆర్ఎల్ కళాశాలలో ర్యాలీ

భీమవరం: ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ ద్వారా విద్యార్థులు ఉద్యోగావకాశాలు పొందే అవకాశముందని భీమవరం కేజీఆర్ఎల్ కళాశాల కార్యదర్శి మెంటే రామ్‌మనోహర్ అన్నారు. శనివారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం ప్రారంభించి మాట్లాడారు. నిర్దిష్టమైన జీవన ప్రమాణాలుండాలంటే ప్రతి విద్యార్థి ఎన్ఎస్ఎస్, ఎన్సీసీలను అనుసరించాలని, జాతీయ భావాలు, దేశ భక్తి యువతలో రావాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో ర్యాలీ నిర్వహించి 200 మొక్కలను నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇంటి రామచంద్రమూర్తి, పీజీ డైరెక్టర్ తోట రామ్మూర్తి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం గంగాధరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు చినమిల్లి పరామర్శ



వెంకటసుబ్బమ్మకు నివాళులర్పిస్తున్న వెంకటరాయుడు తదితరులు

భీమవరం: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శీలంశెట్టి రంగాప్రసాద్‌ను శనివారం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు పరామర్శించారు. ఇటీవల రంగాప్రసాద్ తల్లి వెంకటసుబ్బమ్మ మృతి చెందడంతో చినమిల్లి 28వ వార్డులోని రంగప్రసాద్ ఇంటికివెళ్లి వెంకటసుబ్బమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట భీమవరం పట్టణం, వీరవాసరం మండల పార్టీ అధ్యక్షులు గాదిరాజు రామరాజు, చవాకుల సత్యనారాయణ, కిరణ్ బాబు, గాజుల ప్రసాద్ తదితరులున్నారు.

వేంద్ర పాఠశాల విద్యార్థుల ప్రతిభ



జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పాలకోడేరు: బాలికా సంరక్షణపై నిర్వహించిన జిల్లా స్థాయి చిత్ర లేఖనం పోటీల్లో వేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వేంద్ర దీపిక ప్రథమస్థానం సాధించింది. అదేవిధంగా వారధి ఇండియా ఫౌండేషన్ వార్షిక వ్యాచరచన జిల్లా స్థాయి పోటీలలో సింగంశెట్టి యురేక, వనము కృతిక బృందం జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవీవీ శ్రీనివాస్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పాల వెంకట చలపతి, పాఠశాల విద్యాకమిటీ మెంబర్ కడలి వెంకట ఫణికుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఓట్ల చోరీపై సంతకాల సేకరణ



కాళ్లకూరులో సంతకాల సేకరణ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాళ్ల: ఓట్ల చోరీపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం కాళ్లకూరులో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ ఓటు హక్కును కాపాడేందుకు, ఓటు చోరీని అడ్డుకునేందుకు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటిహరి కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందించిన దృశ్యం

భీమవరం అర్బన్: పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయులు ఎస్ సూర్యభగవాన్ రాజు అన్నారు. అనాకోడేరులోని డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు రేపాక వెంకన్న బాబు సౌజన్యంతో పదో తరగతి విద్యార్థులకు ఏపీ ఎమ్ఎఫ్ గణిత దీప్తి స్టడీ మెటీరియల్‌ను శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మురికి కూపంలా పారిశ్రామిక వాడ



ఇండస్ట్రియల్ ప్రాంతంలో డ్రైయినేజీ, రోడ్డు కలిసిపోయిన దృశ్యం



రోడ్డు వెంబడి చెత్త డంపింగ్



రోడ్డు దుస్థితి ఇలా..

- అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ
- రోడ్డుపైనే మురుగునీరు, దోమల విజృంభణ
- అధికారులకు పట్టని వైనం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరంలోని (ఇండస్ట్రీయల్ ఏరియా) పారిశ్రామిక వాడ అధ్వానంగా తయారైంది. డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో రోడ్డుపైనే మురుగునీరు నిలిచిపోయి ఈ ప్రాంతం మురికి కూపంగా తయారైంది. రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోవడం, డ్రెయినేజీలు అధ్వానంగా ఉండడంతో దోమలు పెరిగిపోయి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇండస్ట్రీయల్ ఏరియా కావడంతో రోడ్లకు అనుకుని అనేక వస్తువుల తయారీ షాపులు, ఫీడ్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వాటిలో వందలాది కార్మికులు పనిచేస్తున్నారు. షాపులు డ్రెయినేజీలకు అనుకుని ఉండడంతో కార్మికులు రోజూ 8 నుంచి 10 గంటల పాటు డ్రెయినేజీ పక్కనే పనిచేస్తున్నారు. దాంతో దోమలు బారిన పడి అనారోగ్యం పాలవుతున్నారు.

దోమలకు ఆవాసంగా..

ఆర్టీసీ డిపో దగ్గర నుంచి బ్రౌనింగ్ కళాశాల వరకు దాదాపు 36 ఎకరాల్లో ఇండస్ట్రీయల్ ఏరియా ఉంది. ఈ ప్రాంతంలో రోడ్లు అనుకుని డ్రెయిన్లు ఉన్నాయి. ఈ డ్రెయిన్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి ప్రమాదకరమైన మలేరియా, డెంగీ దోమలకు ఆవాసంగా మారాయి. డ్రెయినేజీల నుంచి వచ్చే దుర్గంధం భరించలేక అక్కడ పనిచేవారు నానా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే అదే ప్రాంతం నుంచి సీఎస్ఎన్ కళాశాలకు, విద్యుత్ కార్యాలయానికి వెళ్లే మార్గం కావడంతో మురికి నీళ్లలోనే విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి. పరిశ్రమల్లో పనిచేసే వారి కుటుంబాలు ఆ ప్రాంతంలోనే నివాసం ఉండడంతో వారిందరి ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉంది.

పట్టించుకోని యంత్రాంగం

ఇండస్ట్రీయల్ ఏరియాలో పారిశుధ్యం అధ్వానంగా ఉండి ప్రజారోగ్యం దెబ్బతినేలా ఉన్నా మున్సిపల్ అధికారులు గానీ, పరిశ్రమల అధికారులు గానీ ఇండస్ట్రీయల్ సొసైటీ వారుగాని పట్టించుకోవడం లేదు. ఇండస్ట్రీయల్ ఏరియాలో పారిశుధ్యం మాకు సంబంధం లేదని మున్సిపల్ శానిటేషన్ విభాగం అధికారులు చెబుతున్నారు. అయితే అక్కడ ఉన్న షాపులు, పరిశ్రమల నుంచి 25 శాతం పన్ను మున్సిపాలిటీకి కడుతున్నా పారిశుధ్యం నిర్వహణపై మాత్రం వారు చర్యలు తీసుకొవాలా లేదా మున్సిపల్ అధికారులకు తెలియని పరిస్థితి. ఇండస్ట్రీయల్ సొసైటీ వారు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా వారూ పట్టించుకోవడం లేదు. పరిశ్రమల్లో పనిచేసే వారి ఆరోగ్యాన్ని పూర్తిగా గాలికొదిలేశారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

స్వచ్ఛ ఆంధ్రా ఇక్కడ అవసరం లేదా?

కూటమి ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం భీమవరం ఇండస్ట్రీయల్ ఏరియాలో అవసరం లేదా అన్నట్లుగా ఉంది. స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం చేపట్టి పట్టణంలో ప్లాస్టిక్, చెత్తాచెదారం లేకుండా చూడాలని అధికారులకు అదేశాలు, సమావేశాలు నిర్వహిస్తున్న జిల్లా ఉన్నత అధికారులు ఇండస్ట్రీయల్ ఏరియా వైపు మాత్రం దృష్టి పెట్టడం లేదు. జిల్లా కేంద్రమైన భీమవరంలో పారిశుధ్యం అత్యంత అధ్వానంగా ఉన్న ఇండస్ట్రీయల్ ఏరియాపై కలెక్టర్ దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

22న యూపీఎఫ్ సమావేశం

ఉండి: ఈ నెల 22వ తేదీన ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్(యుపీఎఫ్) మండల సమావేశాన్ని చెరుకువాడ పెదపేటలోని నిస్సీ కల్వరీ ప్రార్థనా మందిరం యూపీసీ మినిస్ట్రీస్ చర్చ్‌లో పాస్టర్ పీ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కార్యవర్గ ప్రతినిధులు తెలిపారు. యూపీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బ్రదర్ మేడిద జాన్సన్ ముఖ్య అతిథిగా సమావేశానికి హాజరవుతారని తెలిపారు.

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు

భీమవరం: భీమవరంలో ఓ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో ఏడాది చదువుతున్న విద్యార్థి ఈ నెల 17 నుంచి కనిపించడంలేదని ఫిర్యాదు అందినట్లు సీఐ జి.కాళీచరణ్ తెలిపారు. శ్రీకాకుళానికి చెందిన యువకుడు భీమవరంలోనే ఓ గదిలో అద్దెకు ఉంటూ చదువుకుంటున్నాడు. సీసీ కెమేరా పుటేజీ పరిశీలించగా విద్యార్థి రైలు ఎక్కి విజయవాడవైపు వెళ్లినట్లు తెలియడంతో ఆ దిశగా పోలీసు బృందాలు గాలింపు ముమ్మరం చేశాయన్నారు.

రూ.1.50 కోట్లతో లింకురోడ్డు

ఉండి: వెలివర్రు వీరపేరంటాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద నుంచి మహదేవపట్నం రామచంద్రపురం మీదుగా లింకురోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు శనివారం శంకుస్థాపన చేసారు. మొత్తం రూ.1.50 కోట్లతో నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే ఉండి సెంటర్‌లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కొబ్బరిమొక్క నాటారు.

స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర



మొక్కలు నాటుతున్న డీఎంహెచ్‌వో గీతాబాయి

భీమవరం (ప్రకాశంచౌక్): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం కార్యాలయ ఉద్యోగులతో ప్రతిజ్ఞ నిర్వహించారు.

కాళ్లకూరులో...

కాళ్ల: మండల పరిధిలోని పలుగ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కాళ్లకూరు సొసైటీలో సీఈఓ యిబ్బా శ్రీనివాస్ సిబ్బందితో కలిసి బ్యాంకు ఆవరణలో ఉన్న గడ్డి, పిచ్చిమొక్కలను తొలగించారు.

ప్రతి ఒక్కరూ మొక్కను దత్తత తీసుకోవాలి



గ్రీన్ -ఆంధ్రప్రదేశ్ గ్రీన్ భీమవరం కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): పురపాలక సంఘం పరిధిలోని ప్రతి ఒక్కరూ తమ ఇంటిలో తడి వ్యర్థాలను ఇంటి వద్దనే హోం కంపోస్టుగా మార్చుకోవాలని భీమవరం పురపాలక సంఘ కమిషనర్ కె రామచంద్రారెడ్డి కోరారు. శనివారం నిర్వహించిన గ్రీన్ ఆంధ్రప్రదేశ్ – గ్రీన్ భీమవరం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యర్థాల ద్వారా వచ్చిన కంపోస్టు ఎరువును ఉపయోగించుకుని ఇంటి పైన ఉన్న ఖాళీ స్థలాల్లో అవసరమైన కూరగాయలు, పూల మొక్కలను పెంచుకునే విధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి వ్యక్తి బాధ్యతగా ఒక మొక్కను దత్తత తీసుకొని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, అసిస్టెంట్ కమిషనర్, వార్డు సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

స్టార్టప్‌ల ఏర్పాటుకు కృషిచేయాలి



ఎస్ఆర్‌కేఆర్‌లో మాట్లాడుతున్న శ్రీరామ్

భీమవరం: పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసమేగాకుండా స్టార్టప్‌లు ఏర్పాటుకు కృషి చేసి మరికొందరికి ఉపాధి కల్పించాలని ఇంటర్నేషనల్ బిజినెస్ నెట్‌వర్క్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి శ్రీరామ్ అన్నారు. శనివారం స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో వివిధ విభాగాల డీన్స్, డిపార్ట్‌మెంట్ హెడ్స్‌తో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. భీమవరంలో బీఎన్ఐ ఆదిత్య చాప్టర్ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని, దీనిలో భాగంగా ఈనెల 25న ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కాగోరే విద్యార్థుతో సదస్సు నిర్వహిస్తున్నట్లు శ్రీరామ్ వెల్లడించారు. సమీక్షకు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బీహెచ్ వీఎస్ రామకృష్ణంరాజు అధ్యక్షత వహించారు.

సనాతన ధర్మ పరిరక్షణే ప్రపంచ శాంతి



ఆలయంలో మాట్లాడుతున్న యోగి శ్రీసంత్ సదానంద గిరి స్వామి మహరాజ్

భీమవరం (ప్రకాశంచౌక్): సనాతన ధర్మ పరిరక్షణే ప్రపంచ శాంతి అని శతాధిక వృద్ధులు హిమాలయ యోగి శ్రీసంత్ సదానంద గిరి స్వామి మహరాజ్ (109) అన్నారు. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామివారిని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మహారాజ్ స్వామి మాట్లాడుతూ గౌతమి బుద్ధుని కాలంలో కులాలు, మతాలు లేవన్నారు. నేడు మానవులు కులమతాలు జాతులతో కొట్లాడుకుంటున్నారని, భగవంతుడిని ధిక్కరించే పరిస్థితి నేటి కాలంలో ఏర్పడిందన్నారు. మానవులు అందరూ ఆధ్యాత్మిక చైతన్యంతో మెలగాలని సూచించారు. అనంతరం ఆలయ మర్యాదలతో వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఉద్దరాజు ఫౌండేషన్ నుంచి ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, కుక్కల బాల, చెరుకువాడ రంగసాయి, సరిపిడకల రామారావు, జానపాటి మధు, పిప్పళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

భీమవరం: అనేకరకాల కాలుష్యాల అగ్నిజ్వాలల్లో ఉడికిపోతున్న భూమాతను చల్లబర్చాలంటే రాష్ట్రంలో పచ్చని వృక్షాల తోరణంగా అలంకరించాలని భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన అన్నారు. శనివారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో మొక్కలు నాటిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కాకుమాని శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి.అరవిందస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అల్జీమర్స్ ఆందోళన కలిగిస్తోంది



అంతర్జాతీయ అల్జీమర్స్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రమణరావు

భీమవరం: వయసు పెరిగే కొద్ది వచ్చే అల్జీమర్స్ వ్యాధి సోకిన వారు తమ పేరును సైతం మర్చిపోతారని ఈ వ్యాధి 60 ఏళ్ల వయస్సుదాటిన వారిలో ఎక్కువగా వస్తోందని ప్రస్తుత పరిస్థితిల్లో 45 ఏళ్ల వయస్సు వారిలో కూడా వ్యాధి లక్షణాలు కన్పించడం ఆందోళన కలిగిస్తోందని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ జీవి రమణరావు అన్నారు. భీమవరం శాంతినర్సింగ్ హోమ్‌లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ అల్జీమర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్య సంస్థల నివేదిక ప్రకారం ప్రతి 7 సెకన్లకు ఒకరు అల్జీమర్స్ వ్యాధి బారిన పడుతున్నారని, వ్యాధి సోకిన వారు వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుభాష్, డాక్టర్ శ్రీవిద్య, వేదిక నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

స్వస్థనారీ స్వశక్తి పరివార్ వైద్య శిబిరం



భీమవరంలో టీబీ రోగులకు పోషకాహార కిట్లు అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం ఏరియా హాస్పిటల్ నందు శనివారం స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం వైద్యశిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు శిబిరాన్ని సందర్శించి పరీక్షలు, పోషకాహారం వంటి వివరాలపై అడిగి తెలుసుకున్నారు. ఆయన చేతుల మీదుగా టీబీ పేషెంట్లకు నిశ్చయమిత్ర ఫుడ్ బాస్కెట్లు అందజేశారు. డాక్టర్ కేజీ ఎన్ రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిక్షేమిత్రాగా రిజిస్టర్ కావాలని తెలియజేశారు. ప్రతి రోగిని టీబీ స్క్రీనింగ్ చేసి వారికి వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే వారిని కఫం పరీక్ష, ఎక్స్రేకి రిఫర్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఆర్ విద్యానంద్, డీపీఎస్ పి సత్యనారాయణ, ఎస్టీఎస్ఎస్ఆర్ ప్రసాద్, ఎస్టిఎల్ఎస్ రెడ్డి, భవ్య మధుమతి మామిడి, సిబ్బంది పాల్గొన్నారు.

నందమూరి గరువులో వైద్యశిబిరం

వీరవాసరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని నందమూరి గరువు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో స్వస్థ నారీ స్వశక్తి పరివార అభియాన్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని సర్పంచ్ మేకల వెంకట చలపతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఈట ఎంవీవీ ఎస్ రాజేష్ పర్యవేక్షణలో వైద్యసిబ్బంది కేన్సర్ స్క్రీనింగ్, రక్తహీనతపై మహిళలు, బాలికలకు తగు సూచనలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పోషకాహారం అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కే ప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ శాంతి దినోత్సవం



ఉండి జెడ్పీ హైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

ఉండి: ప్రపంచవ్యాప్తంగా ప్రజలంతా కోరుకునేది శాంతియుత వాతావరణాన్నే అని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. శనివారం ఉండి జడ్పీ హైస్కూల్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, క్లబ్ ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థి దశ నుంచే ప్రపంచ శాంతి అంశంపై విద్యాబోధన జరగాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం ఏలూరుపాటి రామలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకివీడు: ప్రపంచ శాంతి అందరి బాధ్యత అని ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత అన్నారు. ప్రపంచ శాంతి దినోత్సవాన్ని శనివారం కళాశాల ఆవరణలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ఎం.ప్రవల్లిక, ఎస్.బంగారు శ్రావణి, పీ.హనుదుర్గ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు.

శ్రీవారికి జలాభిషేకం



స్వామివారికి నిర్వహిస్తున్న శాంతి కల్యాణం



దేవతామూర్తులకు సప్త నదులతో జలాభిషేకం

కాళ్ల: గోవింద నామస్మరణలతో కాళ్లకూరు గ్రామం మార్మోగింది. గ్రామంలో వేంచేసియున్న స్వయంభు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి సప్త నదుల జలాలతో జలాభిషేకం నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా దేవస్థానంలో గతనాలుగు రోజులుగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. చివరి రోజైన శనివారం స్వామి అమ్మవార్లకు సప్తనదులైన గోదావరి, సరస్వతి, యమునా, గంగా, కృష్ణ, కావేరి, నర్మద నదుల నుంచి తీసుకొచ్చిన పవిత్ర జలాలతో భక్తిశ్రద్ధలతో అభిషేకాలు జరిపారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకష్ణంరాజు దంపతులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ముందుగా సప్త నది జలాలు, పవిత్రాలతో గ్రామంలో శోభయాత్ర నిర్వహించి అష్టోత్తర కలశార్చన గావించారు. అనంతరం శాంతి కల్యాణ మహోత్సవం అష్టోత్తర పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులు

పాలకోడేరు: మండల స్థాయిలో 2025–26 సంవత్సర గ్రామ పంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఈనెల 25, 26 తేదీల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. మండల పరిషత్ అధ్యక్షులు, మండలంలోని గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు శిక్షణ తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

యుద్ధ వాతావరణంతో అంతా నష్టమే

పాలకొల్లు సెంట్రల్: ప్రపంచ శాంతి కావాలంటే ప్రతీ పౌరుడు సంయమనం పాటించాలని ప్రతీ విషయాన్ని కూలంకషంగా ఆలోచిస్తే శాంతి మార్గం కనిపిస్తుందని లయన్స్ క్లబ్ అధ్యక్షులు శిడగం సతీష్ అన్నారు. శనివారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ శాంతి దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సతీష్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచంలో యుద్ధ వాతావరణం నెలకొందని అన్నారు. దీనివల్ల ప్రాణ నష్టం, ఆర్థిక నష్టం, ఆహార ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు సమాజాభివృద్ధికి కృషి చేయాలని తద్వారా శాంతి ప్రపంచాన్ని సమకూర్చుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో 26 పాఠశాలల్లో అలాగే లయన్స్ ఆసుపత్రిలో మొత్తం 27 ప్రాంతాల్లో శాంతి ప్రతిజ్ఞ చేయించామన్నారు.

బ్యాంకు ఖాతాలను తరచూ చెక్ చేసుకోవాలి

యలమంచిలి: ఖాతాదారులు తమ బ్యాంకు ఖాతాలను తరచూ చెక్ చేసుకోవాలని విజిలెన్స్ ఆఫీసర్ రాంబాబు కోరారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా మేడపాడు గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో శనివారం ఖాతాదారులతో సదస్సు నిర్వహించారు. ఖాతాదారులు డబ్బులు వేసిన సమయంలోనూ, తీసిన సమయంలోనూ తప్పనిసరిగా స్టేట్‌మెంట్ రికార్డు చేయించుకోవాలన్నారు. బ్యాంకు ఎప్పుడూ ఓటీపీలు ఫోన్‌లో అడగదన్నారు. ఫోన్‌లో ఏటీఎం పిన్‌లు, ఖాతా వివరాలకు చెందిన ఓటీపీలు చెప్పవద్దని కోరారు. డిజిటల్ లావాదేవీలలో మీ ప్రమేయం లేకుండా నగదు లావాదేవీలు జరిగితే వెంటనే ఏటీఎం కార్డులను బ్లాక్ చేసి బ్యాంకుకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజరు హైమవతి, సిబ్బంది పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలు జలమయం



దొంగపిండిలో వర్షం పడుతున్న దృశ్యం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని అనాకోడేరు, కొమరాడ, గూట్లపాడు, గొల్లవానితిప్ప, లోసరి, తోకతిప్ప, రాయలం, చినఅమిరం, తుందుర్రు, తాడేరు, వెంప, పెదగరువు తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు 4 గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పల్లపు గ్రామాలైన దెయ్యాలతిప్ప, తోకతిప్ప, దొంగపిండి, లోసరి తదితర గ్రామాల్లో శివారు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ వర్షం వల్ల వరి చేలకు అగ్గితెగులు వ్యాప్తి చెందుతుందని రైతులు చెబుతున్నారు. రొయ్యల చెరువుల్లో రొయ్యలకు వైరస్ వ్యాప్తి ఎక్కువ అవుతుందని రొయ్య రైతులు ఆందోళన చెందుతున్నారు.